ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

శనివారం 10 ఫిబ్రవరి 2024

ఓపీఎస్ ఇచ్చిన వారికే ఓటు: యూటీఎఫ్

పార్వతీపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఓపీఎస్ ఇచ్చిన వారికే తమ ఓటు అని యూటీఎఫ్ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఈవో కార్యాలయం ఎదుట పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ తీసుకొస్తానని చెప్పిన సీఎం జగన్ మాట తప్పి, మడమ తిప్పారని అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులను మోసం చేశారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఓపీఎస్ ఒక రాజకీయ ఎజెండాగా మార్చడానికి ఉద్యమాన్ని చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు, ట్రెజరర్, కార్యదర్శులు తదితరులున్నారు.

ఖాళీ స్థలమా.. కబ్జానే!

- ఆక్రమణల చెరలో పాలకొండ
- ప్రభుత్వ స్థలాలు, విలువైన భూములు అన్యాక్రాంతం
- యథేచ్ఛగా నిర్మాణాలు.. మరికొన్నిచోట్ల అమ్మకాలు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదుల వెల్లువ
- పటిష్ఠ చర్యలు శూన్యం
- అధికార పార్టీ నేతల అండదండలతో రెచ్చిపోతున్న ఆక్రమణదారులు

(పాలకొండ)

డివిజన్ కేంద్రం పాలకొండ కబ్జాదారుల కోరల్లో చిక్కుకుంది. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు ఆక్రమణకు గురవుతోంది. ప్రభుత్వ స్థలాలను గుర్తించి మరీ తమ కబంధ హస్తాల్లోకి లాక్కొనేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. మరికొందరు ఇప్పటికే ప్రభుత్వ స్థలాల్లో తిష్ఠ వేశారు. ఇలా పాలకొండ నగరపంచాయతీ పరిధిలోని నలువైపులా ఇష్టానుసారంగా ఆక్రమిస్తున్నారు. ఈ కబ్జాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అయినా పటిష్ఠ చర్యలు శూన్యం. దీంతో అధికార పార్టీ నేతల అండదండలతో కొంతమంది రెచ్చిపోతున్నారు.

ఇదీ సంగతి..

జిల్లా విభజన తర్వాత పాలకొండ పట్టణంలో భూములకు డిమాండ్ పెరిగింది. దీంతో వాటి ధరలు అమాంతం పెరిగాయి. ఇదే సమయంలో పలువురు అధికార పార్టీ నాయకుల అండదండలతో ప్రభుత్వ స్థలాలు, విలువైన భూములను యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. దీనిపై ప్రజల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతుండడంతో.. భూ ఆక్రమణలకు అక్కడక్కడా ఫుల్‌స్టాప్ పడుతుంది. మరికొన్ని చోట్ల అధికార పార్టీ నాయకుల అండదండలతో స్థలాలు ఆక్రమణ చేపట్టి మరీ అమ్మకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పట్టణం పరిధిలో సెంటు ధర రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఉంది. దీంతో ఆక్రమణదారులు మరింతగా రెచ్చిపోయి ప్రభుత్వ స్థలాలను తమ కబంధ హస్తాల్లోకి తీసుకుంటున్నారు. ఇటీవల అధికార పార్టీకి చెందిన పలువురు కౌన్సిలర్లు వారి కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట రెవెన్యూ, నగర పంచాయతీ అధికారుల సహకారంతో ప్రభుత్వ స్థలాలను సొంతం చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే అధికార పార్టీకి చెందిన నాయకులతో పాటు టీడీపీ నేతలు, పట్టణ పౌరులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పించాలని వినతిపత్రాలు అందించారు.



గారమ్మకాలనీలోని ప్రభుత్వ స్థలంపై కన్నేసిన కబ్జాదారులు



జగన్నాథస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు

ఆక్రమణలు ఇలా..

● స్థానిక నగర పంచాయతీలోని నాగవంశపువీధిలో ఉన్న పీతలవానిబంద 80 శాతం వరకు కబ్జా కోరల్లోనే చిక్కుకుంది. ● గొల్లవీధిలో ఉన్న డీసీఎంఎస్ గొడౌన్‌కు ఆనుకొని ఉన్న స్థలాన్ని కూడా ఆక్రమించారు. ● జగన్నాథస్వామి గుడి ఎదురుగా ఉన్న కొంతమంది వారి సొంత స్థలానికి ఆనుకొని ఉన్న ఆలయ స్థలాలను ఆక్రమించుకొని ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ● ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో సర్వే నెంబర్ 20లోని 1, 2లో 30 సెంట్ల స్థలం ఉంది. ఆ స్థలాన్ని కొంతమంది కౌన్సిలర్లు వారి కుటుంబ సభ్యులు, రక్తసంబంధీకులు, స్నేహితుల పేర్లతో నగర పంచాయతీకి వీఎల్‌టీ కట్టారు. రెవెన్యూ అధికారుల నుంచి పొజిషన్ సర్టిఫికెట్ తీసుకొని 30 సెంట్ల స్థలాన్ని సొంతం చేసుకున్నట్టు పదో వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు దుంపల రమేష్ ఈ నెల 5న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే ఇప్పటికే ఆ స్థలం పొజిషన్‌లో ఉన్న వారు కోర్టును ఆశ్రయించినట్టు చెబుతున్నారు. ఇదే స్థలంపై దళిత సంఘ నాయకుడు బత్తిన మోహన్‌రావు కూడా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ● గతంలో నగర పంచాయతీ కమిషనర్‌గా పనిచేసిన లిల్లీ పుష్పనాథం.. పట్టణంలో గొడగలవీధికి ఆనుకొని ఉన్న సుమారు ఆరు ఎకరాలను ప్రభుత్వ స్థలంగా గుర్తించి బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే ఇప్పుడు ఆరు ఎకరాలను కొంతమంది వ్యక్తుల పేర్లతో వన్‌బీ అడంగల్ చేసుకున్నట్టు తెలుస్తోంది. ● స్థానిక గారమ్మకాలనీలో సామాజిక అవసరాల కోసం ఉంచిన 25 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది కౌన్సిలర్లు ఆక్రమించుకొనేందుకు ప్రయత్నించారు. దీనిపై కాలనీవాసులు, ప్రజా సంఘాల నేతలు కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఆ స్థలం ఆక్రమణలకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ● పట్టణంలోని పేదల సామాజిక అవసరాల కోసం బుక్కూరులోని జగనన్న కాలనీలో ఉంచిన 50 సెంట్ల స్థలాన్ని అధికార పార్టీకి చెందిన కొంత మంది రెవెన్యూశాఖ సహకారంతో పట్టాలు చేసుకొని స్వాధీనం చేసుకొనేందుకు ప్రయత్నించారు. దీనిపై టీడీపీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు.

చర్యలు తీసుకుంటాం..

పట్టణంలో నగర పంచాయతీకి సంబంధించిన స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. నిబంధనల మేరకు ప్రభుత్వ స్థలాల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాలను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేస్తాం.

-సర్వేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్, పాలకొండ

పరిశీలించిన ఆర్డీవో..

పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కనే ఉన్న 30 సెంట్ల భూమి ఆక్రమణలపై అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆర్డీవో వీవీ రమణ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. మరోసారి సర్వే చేసి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ వరహాలు, సర్వేయర్, ఆర్ఐ, ఫిర్యాదుదారులు తదితరులు ఉన్నారు.



ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో



సామాజిక తనిఖీ ప్రజావేదికలో డ్వామా పీడీ తదితరులు

రికార్డులు లేకుండా ఉపాధి హామీ పనులా?

● డ్వామా పీడీ ఆగ్రహం

పాచిపెంట, ఫిబ్రవరి 9 : రికార్డులు లేకుండా ఉపాధి హామీ పనులు ఎలా చేపడుతున్నారని డ్వామా పీడీ కె.రామచంద్రరావు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పాచిపెంటలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడా రికార్డులు లేకుండా ఉపాధి పనులు చేపట్టడం లేదన్నారు. కానీ పాచిపెంట మండలం కర్రివలస పంచాయతీ పరిధిలో ఎలా సాధ్యమైందో అర్థం కావడం లేదన్నారు. అనంతరం ఇద్దరు ఏపీవోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరుండి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేవలం కాగితాలపై నమోదు చేసి పనులు చేపట్టడం తగదన్నారు. ఇకపోతే మండలంలో రోడ్డుకు ఇరువైపులా నాటిన వందల కొద్దీ మొక్కలు చనిపోయాయని, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించలేదని ఆయన తెలిపారు. రికవరీలు పెడతానని హెచ్చరించారు. సిబ్బంది పనితీరు మార్చుకోవాలని సూచించారు. లేకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం పనికిరాదన్నారు. ఈ ప్రజా వేదికలో ఎంపీడీవో పి.లక్ష్మీకాంత్, ఎంపీపీ బి.ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం (ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 9: ఉమ్మడి జిల్లాలోని విజయనగరం ఎక్సైజ్ కోర్టు, పార్వతీపురం, కొత్తవలస, సాలూరు కోర్టుల్లో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నియామకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని విజయనగరం జిల్లా ప్రధాన న్యాయాధికారి బి.సాయి కళ్యాణచక్రవర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలవారీ గౌరవ వేతనంపై నియమించనున్నట్లు చెప్పారు. ఈ నెల 22లోగా దరఖాస్తులను జిల్లా న్యాయస్థానానికి అందజేయాలన్నారు. వివరాల కోసం పరిపాలనాధికారి, జిల్లా న్యాయస్థానాన్ని సంప్రదించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి: కలెక్టర్

గుమ్మలక్ష్మీపురం: పోలింగ్ కేంద్రాల్లోని వసతులపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం దుడ్డుకల్లు, బాలేసు, భద్రగిరి గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల భవనాలు, అందులో వసతులు పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు ఉండాలని ఆదేశించారు. అనంతరం భద్రగిరి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి.. చిన్నారుల అభ్యసన తీరును గమనించారు. చిన్నారుల బరువు, ఎత్తు స్వయంగా పరిశీలించారు. గర్భిణుల ఇంటికి రేషన్ అందించడమే కాకుండా వారు మాత్రమే తీసుకొనే విధంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఆ తర్వాత దుడ్డుకల్లు పాఠశాలలో విద్యార్థుల కోసం వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు.

రక్తహీనత నివారణకు డీవార్మింగ్ డే

చిన్నారుల్లో రక్తహీనత నివారణకు డీ వార్మింగ్ డే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. బాలేసు పాఠశాలలో జాతీయ నులి పురుగుల నివారణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నులిపురుగులు, పోషకాహార లోపంతో చిన్నారులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామన్నారు. ఈ నెల 16న మాప్‌అప్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో మండల అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



దుడ్డుకల్లులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

దాహం తీర్చండయ్యా!

● టీడీపీ ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో మహిళల నిరసన



పార్వతీపురం రూరల్: తాగునీటి సమస్య పరిష్కరించాలని, దాహార్తి తీర్చాలని జోకిశిల గ్రామంలో మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. ఈ నిరసనలో పాల్గొన్న టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర మాట్లాడుతూ.. మండలంలో అనేక గ్రామాలతో పాటు పార్వతీపురం, బలిజిపేట, సీతానగరం, మండలాల్లోనూ తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. ఇప్పుడే ఇలా ఉంటే.. మండు వేసవిలో పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీటిని అందించలేని వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ నిరసనలో టీడీపీ మండల అధ్యక్షుడు బోను దేవి చంద్రమౌళి, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వెంకటనాయుడు, నాయకులు బుడితి శ్రీరాములు తదితరులున్నారు.

ఆమె వయసు 124 ఏళ్లంట!

● ఓటరు గుర్తింపు కార్డు జారీ

● అధికారుల నిర్వాకంపై విమర్శల వెల్లువ

పార్వతీపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తప్పులన్నీ సరిద్దిన తర్వాతే ముసాయిదా ఓటరు ఓబితాను ప్రచురించా మని అధికారులు చెబుతున్నా.. వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఓటరు జాబితాలు తప్పుల తడకగా మారాయి. రోజూ అనేక లోపాలు వెలుగు చూస్తున్నాయి. జాబితాలో మృతి చెందిన వారి పేర్లు, ఒకే ఇంటి నెంబర్‌తో పదుల సంఖ్యలో ఓట్లు ఇప్పటివరకు కనిపిస్తూనే ఉన్నాయి. తాజాగా ఓ మహిళ వయసును ఎక్కువగా నమోదు చేసి ఓటరు జాబితో చేర్చిన అంశం బయటపడింది. పార్వతీపురం మండలం లక్ష్మీనారాయణ గ్రామానికి చెందిన బురిడి రేగాలమ్మకు 44 సంవత్సరాలు. కానీ ఓటరు గుర్తింపు కార్డులో ఆమె పుట్టిన తేదీని తప్పుగా నమోదు చేశారు. 1900, జనవరిలో ఆమె జన్మించినట్లుగా నమోదు చేసి ఓటరు ఐడీ కార్డు జారీ చేశారు. దీంతో ఆమె వయసు 124 సంవత్సరాలుగా మారింది. మొత్తంగా అధికారుల నిర్వాకంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటువంటి తప్పులు ఓటరు జాబితాలో ఇంకెన్ని ఉన్నాయోననే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి.



విద్యాభివృద్ధిలో జిల్లా ముందుండాలి: డీఈవో

పార్వతీపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్ర జ్యోతి)/ సాలూరు రూరల్: జిల్లా విద్యా భివృద్ధిలో ముందుం డాలని డీఈవో పగడాలమ్మ అన్నారు. జిల్లా విద్యాశాఖాధికారిగా ఆమె గురువారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు శుక్రవారం డీఈవోను యూటీఎఫ్ నేతలు మురళీమోహన్, ఎంఈవోల సంఘం అధ్యక్షుడు సామల సింహాచలం ఆధ్వర్యంలో ఎంఈవోలు జోగారావు, సతీష్‌కుమార్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంఈ వోలు, ఇతర సిబ్బంది పూర్తిగా సహకారమందించి విద్యాభి వృద్ధికి కృషి చేయాలని ఆమె సూచించారు. ఈ ఏడాది కూడా టెన్త్ ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచేలా టీచర్లు కృషి చేయాలని, ప్రతిఒక్కరూ అంకితభావంతో పని చేయాలని సూచించారు.

నాడు ఓటీఎస్ అనిపించారు.. నేడు రోడ్డెక్కించారు

● ప్రభుత్వం, అధికారులు మాటలు నమ్మి.. అప్పులు చేసి మరీ చెల్లించిన పేదలు ● సంపూర్ణ గృహ హక్కు పథకం పత్రాలు పొందినా.. ఫలితం లేని వైనం

● రుణాల మంజూరు చేయని బ్యాంకర్లు ● లబోదిబోమంటున్న 78 మంది మహిళలు ● మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన ● న్యాయం చేయాలని డిమాండ్



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న 11వ వార్డుకు చెందిన మహిళలు

సాలూరు, ఫిబ్రవరి 9: ఎన్నో దశాబ్దాలుగా ఉంటున్న ఇళ్లపై పేదలు సర్వ హక్కులు పొందాలంటే.. ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) కింద చెల్లించాలని గతంలో వైసీపీ సర్కారు ప్రకటించింది. అలా చెల్లించిన వారికి జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం పత్రాలు మంజూరు చేస్తామని.. వాటితో బ్యాంకు రుణాలు కూడా పొందొచ్చని పేర్కొంది. దీంతో సాలూరులోని కొంతమంది పేదలతో అధికారులు బలవంతంగా ఓటీఎస్ కింద రూ.15వేలు కట్టించుకున్నారు. సంపూర్ణ గృహ హక్కు పథకం పత్రాలు కూడా ఇచ్చారు. అయితే ఆ తర్వాత సీన్ మారింది. సర్కారు, అధికారులు చెప్పినట్లుగా ఆ హక్కు పత్రాల ద్వారా పేదలకు రుణాలు మంజూరవడం లేదు. బ్యాంకర్లు ససేమిరా అంటున్నారు. దీంతో పేదలు లబోదిబో మంటున్నారు. అప్పులు చేసి ఓటీఎస్ చెల్లించామని, నేడు రుణాలు పొందలేక.. అప్పులకు వడ్డీ చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. మొత్తంగా 'ఇదేం మోసం జగనన్నా' అంటూ పెదవి విరుస్తున్నారు.

వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని 11 వార్డు చిన్నవీధిలో ఉంటున్న 78మంది మహిళలు .. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం పత్రాలతో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పేదలను ప్రభుత్వం ఇలా మోసం చేయడం తగదన్నారు. ఇప్పటికైనా బ్యాంకు రుణాలు వచ్చేలా చేయాలని లేకుంటే, తాము ప్రభుత్వానికి చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని నినదించారు. అనంతరం ఆ వార్డుకు చెందిన గండిపల్లి దీపిక, అంకాలమ్మ, టొంపల పాపమ్మ,లక్ష్మీ తదితరులు విలేఖర్లతో మాట్లాడుతూ.. 'ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న మా ఇళ్లకు సంబంధించి పూర్తి హక్కులు పొందాలంటే.. వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) రూపంలో ప్రభుత్వానికి రూ.15వేలు చెల్లించాలని గతంలో అధికారులు చెప్పారు. అలా చెల్లిస్తే.. సంపూర్ణ గృహ హక్కు పథకం కింద సర్కారు ధ్రువపత్రాలు మంజూరు చేస్తుందని తెలిపారు. దీంతో పొదుపు సంఘాలకు చెందిన తాము మెప్మా ద్వారా రూ.15 వేలు రుణంగా తీసుకుని నాడు సచివాలయంలో చెల్లించాం. ఆ తర్వాత మాకు సంపూర్ణ గృహ హక్కు ధ్రువపత్రం మంజూరు చేశారు. అయితే ఆ పత్రం పట్టుకుని బ్యాంకులు చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా.. ప్రయోజనం ఉండడం లేదు. ఆ పత్రాలకు ఎలాంటి రుణం ఇచ్చేది లేదని బ్యాంకు అధికారులు తేల్చి చెబుతున్నారు. ఏం చేయాలో మాకు తోచడం లేదు. మెప్మాలో తీసుకున్న రూ.15 వేల రుణానికి సంబంధించి సుమారు రెండేళ్లుగా నెలకు అసలు రూ.1500, వడ్డీ రూ.150 కలుపుకుని మొత్తంగా రూ.1650 చెల్లించాల్సి వస్తోంది. ఇప్పటికే పలుమార్లు క్షేత్ర స్థాయి అధికారులకు మా సమస్యను తెలియజేశాం. కానీ ఎటువంటి చర్యల్లేవు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి' అని వారు డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందించారు.



అధికారులు మంజూరు చేసిన సంపూర్ణ గృహ హక్కు పథకం ధ్రువపత్రం

విద్యార్థులను తీర్చిదిద్దాలి

బొబ్బిలి: విద్యార్థుల మనస్తత్వాల అనుగుణంగా వారిని తీర్చిదిద్దాలని మండల విద్యాశాఖాధికారి చల్ల లక్ష్మణరావు అన్నారు. మండలంలోని పిరిడి జిల్లా పరిషత్ హైస్కూల్లో తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఎస్‌ఈ ఆర్టీ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంటర్ ప్రెన్యూరల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్-ఫేజ్4 (ఈఎండీపీ)లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు సమస్యను గుర్తించి వారికి సమర్థంగా శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యాసంబంధిత అంశాలపై ఆయన అవగాహన కల్పించారు.

రేపు స్వర నీరాజనం

రాజాం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న కళాసాగర్ వేదికపై ఈనెల 11వ తేదీన పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా స్వర నీరాజనం కార్యక్రమం నిర్వహించనున్నామని నిర్వాహకులు మంతపూడి ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బలివాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాడుతా తీయగా కార్యక్రమం, బొడ్డు వీరాస్వామి, ఘంటసాల సంగీత కళాశాల విద్యార్థులచే ఆర్కెస్ట్రా ఉంటుందన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

రాజాం: పురపాలక సంఘం పరిధిలోని వాసవినగర్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలే రాజేష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. రహదారి పనులు సకాలంలో పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ రహదారిలో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నందున పనులు వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు పాలవలస శ్యామసుందర్‌రావు, కమిషనర్ ఎల్.రామప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామంలో శుక్రవారం బాల్య వివాహాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఏసీడీపీ లక్ష్మీబాయి ఆధ్వ ర్యంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. బాలల హక్కులు, వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు.

5వ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట వద్ద గల మహాత్మా జ్యోతిబాఫూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఇంగ్లీషు మీడియం 2024-25 ఏడాదికి 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 4వ తరగతి పూర్తిచేసినవారు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఆఖరు తేదీ మార్చి 31 అని ప్రిన్సిపాల్ యువికే.పాత్రో తెలిపారు.

తైక్వాండో బ్లాక్ బెల్ట్ విజేతలకు అభినందన


బేబీనాయనతో విజేతలు

బొబ్బిలి: ఇటీవల విజయనగరంలో జరిగిన తై క్వాండో బ్లాక్‌బెల్ట్ టెస్టులో విజేతలుగా నిలిచిన బొబ్బిలి విద్యార్థులను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, తైక్వాండో క్లబ్ అధ్యక్షుడు బేబీనాయన అభినందించారు. పట్టణానికి చెందిన చరిత, తేజేశ్వర్, భరద్వాజ్, సుసాన్ నేస్సి, జాహ్నవి, ఆదిత్య, యువకిశోర్ బ్లాక్‌బెల్టులు సాధించడంతో వారిని శుక్రవారం స్థానిక కోటలో బేబీనాయన అభినందించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో టెస్టులు నిర్వహించినట్లు కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు.

పిరిడిలో ఎంపీడీవో పర్యటన

బొబ్బిలి: మండలంలోని పిరిడి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో ఎంపీడీవో రవికుమార్ పాల్గొన్నారు. తొలుత జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్‌ఎం మధుసూదనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన నులిపురుగుల నివారణ కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొని విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు.

'పీవీ'కి సముచిత గౌరవం

బొబ్బిలి: దివంగత మాజీ ప్రధానమం త్రి పీవీ నరసింహారావుకు భారత రత్న ప్రకటించడం ఎంతైనా సముచితమని పీసీసీ అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. శు క్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బహుభాషా కోవిదుడైన పీవీ ఈ దేశానికి సేవలు అమోఘమని అన్నారు. ఏనాడూ పదవులకోసం వెంపర్లాడని పీవీని పదవులే కోరి వచ్చి వరించాయని అన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'పల్లెకు పోదాం'

వేపాడ: బీజేపీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 7లక్షల గ్రామాల్లో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు గోకాడ మహేష్ తెలిపారు. శుక్రవారం విశాఖ పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరంగం దానేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. రాష్ట్ర పార్టీ నాయకులు సన్యాసిరావు, రాష్ట్ర ఎక్స్ సర్వీస్‌మేన్ సెల్ కన్వీనర్ కేవీ.కృష్ణారెడ్డి, రాష్ట్ర యువజన మోర్చ నాయకులు ఐఎస్ఎన్ రాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు వారాది చిరంజీవి, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతి ఆత్మగౌరవం ఢిల్లీలో తాకట్టు

జామి: వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీల ప్రధాన నాయకులు రాష్ట్రానికి రావాల్సిన హక్కులను సాధించడం మానేసి తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో బీజేపీ పెద్దల ముందు తాకట్టు పెట్టారని లోక్‌సత్తా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. శుక్రవారం ఆయన జామిలో విలేకరులతో మాట్లాడుతూ ఈ పార్టీల నాయకులు తమ వ్యక్తిగత స్వార్థం కోసం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను పట్టించుకోవడం లేదన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ సన్నిబాబు, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాయితీపై పరికరాలు అందించాలి

రాజాం: రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలను రాయితీపై అందించేలా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆగూరు అప్పారావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ పరికరాలు అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు రైతులకు సకాలంలో సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏడీ చంద్రరావు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, లావేటి రాజగోపాలనాయుడు, ఎంపీడీవో బానూరు శంకరరావు, ఏఓ ఎం.రేణుకాసాయి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం బాగుండాలంటే టీడీపీ రావాల్సిందే

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 'భవిష్యత్తుకు గ్యారెంటీ'
- సూపర్‌సిక్స్ హామీలను ప్రజలకు వివరించిన టీడీపీ నాయకులు


విజయనగరంలో అదితి గజపతిరాజు ఆధ్వర్యంలో..


మక్కువలో సంధ్యారాణి ఆధ్వర్యంలో..


గరుగుబల్లి: గిజబలో వీరేష్ చంద్రదేవ్ ఆధ్వర్యంలో..


వంగర: కింజంగిలో..

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 9: రాష్ట్రం సురక్షితంగా ఉండాలంటే టీడీపీ-జనసేన కూటమి పాలనే రావాలని, దీనికి ప్రజలంతా రానున్న ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతి రాజు అన్నారు. 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకి గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఆమె 50 వ డివిజన్‌లో గాజులరేగ రాళ్లవీధిలో పర్యటించారు. టీడీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి పత్తిగిల్లి సూర్యకుమారితో పాటు, సియ్యాదుల సీతమ్మ, తోట రమేష్, గెద్ద రమేష్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు నాయుడు మహానాడు వేదికగా ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఈ ప్రభుత్వం అన్నింటా విఫలమైందన్నారు, అన్ని రంగాలను సర్వనాశనం చేసిందన్నారు. టీడీపీ నగర నాయకులు, అనుబంధ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ● **మక్కువ:** రాష్ట్రంలో అభివృద్ధి కావాలంటే మళ్లీ చంద్రబాబే అధికారంలోకి రావాలని టీడీపీ సాలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మిడి సంధ్యారాణి అన్నా రు. మక్కువలో శుక్రవారం ఆమె 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాల నలో నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటాయని, ఏడుసార్లు విద్యుత్తు చార్జీల ను పెంచారని అన్నారు. గ్రామంలోని వీధుల్లో పర్యటిస్తూ వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్, కార్యదర్శి గౌరీశంకర్, నాయకుడు మావుడి ప్రసాదరావు, డాక్టర్ పి.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● **రామభద్రపురం:** రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజల ఆశలు నెరవేరుతాయని తెలుగుదేశం నాయకుడు కూనిశెట్టి భాస్కరరావు అన్నారు. మండల పరిధిలోని ఆరికతోట గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని విధాలా వెనుకబడిపోయిందని, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ప్రజలకు తీరని నష్టం చేసిందని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు అడపా అప్పలకొండ, కార్యకర్తలు పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్ అన్నారు. శుక్రవారం గిజబ పంచాయతీలో బా బు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నా యకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వంగర: చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు వేమిరెడ్డి శ్రీను, పిన్నింటి మోహన్, ఎల్.కృష్ణమూర్తి తదితరులు అన్నారు. కింజంగి, చంద్రంపేట, వంగర, మరువాడ, కోనంగిపాడు తదితర గ్రామాల్లో శుక్ర వారం 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లను మాయ మాటలతో భయ పెడుతున్నారని, ఇది ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. త్వరలో జగన్ ప్రభుత్వం ఇంటికి వెళ్లడం ఖాయన్నారు. నాయకులు ధనలక్ష్మి, శ్రీను, వి.మురళి, రవి, నల్ల మురళి తదితరులు పాల్గొన్నారు.


రామభద్రపురం: ఆరికతోటలో..

'భవిష్యత్తుకు గ్యారెంటీ'పై అవగాహన

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురంలో శుక్రవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పాలకొండ మండలం నుంచి టీడీపీ నాయకులు బిడ్డిక దమయంతినాయుడు, సవర మాలయ్య, బిడ్డిక చంద్రరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి, అడ్డాకుల నరేష్, శ్రీను, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దమయంతినాయుడు

బుడా పరిధిలో ఆరు ప్రాజెక్టుల పూర్తికి చర్యలు

- బొబ్బిలి పర్యటనలో జేసీ కార్తీక్
- వీణల తయారీ కేంద్రం పరిశీలన

బొబ్బిలి, ఫిబ్రవరి 9: బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(బుడా) పరిధిలో చేపట్టిన ఆరు ప్రాజెక్టుల పనులను సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జేసీ, బుడా వైస్‌చైర్మన్ కార్తీక్ తెలిపారు. శుక్రవారం ఆయన బొబ్బిలిలో పర్యటించారు. తొలుత బుడా కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. 1.15 కోట్ల రూపాయలతో బొబ్బిలిలో ఇండోర్ స్టేడియం, సుందరీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. పార్వతీపురం, సాలూరు పార్కుల అభివృద్ధికి 50 లక్షల రూపాయల చొప్పున బుడా నిధులతో సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. సాలూరు పట్టణంలో ఎంఐజీ లేఅవుట్‌లో 102 ప్లాట్లను ఏర్పాటు చేశామని, అందులో 20 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారికి ఈ నెల 15న లాటరీ వేసి స్థలాలను కేటాయిస్తామన్నారు. బొబ్బిలిలో రంగరాయపురం గ్రామ సమీపంలో ఎంఐజీ లేఅవుట్ కోసం భూసేకరణ కోసం సన్నాహాలు జరుగుతున్నాయని, ఇక్కడ లబ్ధిదారుల నుంచి డిమాండ్ సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రీసర్వేలో ఎటువంటి తప్పిదాలు జరగలేదని, గతంలో భూములను అనుభవిస్తున్న వారంతా అవే సరిహద్దులతో పక్కా అనుకున్నారని, ఇప్పుడు రీసర్వేలో పూర్తిగా నిర్ధారణయ్యిందన్నారు. అందరికీ నోటీసులు జారీ చేసి, ఫీల్డు వెరిఫికేషన్ చేస్తున్నట్లు తెలిపారు.


బొబ్బిలి వీణను పరిశీలిస్తున్న జేసీ

గొల్లపల్లి వీణల కేంద్రం పరిశీలన

గొల్లపల్లి వీణల కేంద్రాన్ని జాయింట్ కలెక్టరు కార్తీక్ సందర్శించి అక్కడ వీణల తయారీ కళాకారులతో మాట్లాడారు. కేంద్రం మేనేజర్ సర్వసిద్ధి రామకృష్ణ కళాకారుల సమస్యలను జేసీకి వివరించారు. వీణల తయారీకి వినియోగించే కలపను సబ్సిడీపై విరివిగా సమకూర్చాలని, కళాకారులకు ఆర్థిక ప్రోత్సాహకాలు కల్పించాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామని జేసీ వారికి హామీ ఇచ్చారు. జేసీ వెంట అసిస్టెంట్ కలెక్టర్ త్రివినాగ్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, డీటీ రెడ్డి సాయికృష్ణ, బుడా అధికారులు చక్కా సత్యనారాయణ, ఏపీవో దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిండిమిల్లులో పేదల బియ్యం

- 5 క్వింటాళ్లు సీజ్

రాజాం రూరల్, ఫిబ్రవరి 9: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ రోడ్‌లోని ఓ పిండి మిల్లుపై రెవెన్యూ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా మిల్లులో నిల్వ ఉన్న అయిదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మిల్లు యజమాని రాంబాబుపై కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సివిల్ సప్లై గిడ్డంగికి తరలించారు. దాడుల్లో సీఎస్‌డీటీలు చిరంజీవి, సాయి కామేశ్వర్రావు, ఆర్.ఐ. సాగర్ పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కిలో రూ.15కు కొనుగోలు చేసి రూ.22 నుంచి 25 వరకు తిరిగి అమ్మకం చేసేందుకు వీలుగా పీడీఎస్ రైస్‌ను కొను గోలు చేసి నిల్వ ఉంచినట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు.


స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని గిడ్డంగికి తరలిస్తున్న దృశ్యం

గ్యాస్ లీక్.. మహిళకు తీవ్ర గాయాలు

దత్తిరాజేరు: గ్యాస్ లీకై మహిళకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని తాడేంద్రవలసలో శుక్రవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని మరిపి గౌరమ్మ గురువారం రాత్రి గ్యాస్ వాల్వ్ సరిగ్గా కట్టకుండా నిద్రపోయింది. శుక్రవారం ఉదయం నిద్రలేచి ఇంట్లో బల్బు స్విచ్ వేయగానే ఒక్కసారిగా గ్యాస్ నుంచి మంటలు వ్యాపించాయి. ఈమె మంటల్లో చిక్కుకుని, గాయాల పాలైంది. స్థానికులు స్పందించి, వైజాగ్ కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై స్టేషన్ బూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి పంచాయతీ, కొత్తసుంకరపాలెం గ్రామంలో మద్యం బెల్ట్ షాపును నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం రాత్రి తమకు వచ్చిన సమాచారం మేరకు కొత్త సుంకరపాలెం గ్రామానికి వెళ్లి దాడులు చేశామని, 20 మద్యంయ సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

భోగాపురం: తోటపల్లి గ్రామ సమీపంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న బమ్మిడిపేట గ్రామానికి చెందిన బమ్మిడి రామసూరిని అరెస్టు చేసినట్టు సీఐ ఎ.రవికుమార్ శుక్రవారం తెలిపారు. ముందుగా సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి, రామసూరిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి 42 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

కురుపాం/గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేట సెంటర్‌లో అనధికారంగా మద్యం విక్రయిస్తున్న ఈశ్వరరావు(చంటి) అనే వ్యక్తిని పట్టుకుని, 68 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ టాస్క్ ఫోర్స్ సీఐ ఎస్.సింహాద్రి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

సీతానగరం: మండల పోలీస్‌స్టేషన్‌లో గత సంవత్సరంలో 16 మద్యం కేసులు, ఒక సారా కేసులో పట్టుబడిన 898 మద్యం సీసాలను శుక్రవారం ఠాణా సమీపంలో పారబోశారు. సబ్ డివిజన్ ఏఎస్పీ సునీల్ సరోనా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

రామభద్రపురం: మండల పరిధిలోని నేరెళ్లవలస సమీపంలో శుక్రవారం రాత్రి పోలీసులు జరిపిన దాడుల్లో ఇద్దరు జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.2200ల నగదు స్వాధీనం చేసుకున్నటు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. వీరిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించనున్నామన్నారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది కూడా పాల్గొన్నారు.

పాచిపెంట: మండలంలోని గురువునాయుడుపేట సమీపంలో పేకాట ఆడుతుండగా ఆ గ్రామానికి చెందిన 12 మంది జూదరులపై కేసు నమోదు చేశామని స్థానిక ఎస్ఐ పి.నారాయణరావు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.18వేలు స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని చెప్పారు.

కోడిపందాలపై దాడి

కొత్తవలస: మండలంలోని వీరభద్రపురం పంచాయతీ కర్రి చిన్నయ్యపాలెం గ్రామంలో కోడిపందేలు ఆడుతున్నవారిపై గురువారం రాత్రి దాడి చేసినట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ దాడులలో నలుగురు వ్యక్తులను పట్టుకుని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి రెండు కోడిపుంజులతో పాటు 10 వేల 750 రూపాయలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' పోస్టర్ ఆవిష్కరణ


మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీఎన్ఎస్ఎఫ్


శృంగవరపుకోట, ఫిబ్రవరి 9: స్థానిక అన్న క్యాంటీన్ వద్ద శుక్రవారం 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. మార్పు కోసం... రాష్ట్రం కోసం... భవిష్యత్ కోసం ప్రతి టీడీపీ కార్యకర్త... యువతకు చంద్రబాబు నాయుడు సీఎం కావాల్సిన ఆవశ్యకతను వివరించాలని టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు డెక్క ఈశ్వరరావు, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి చక్కా కిరణ్ కుమార్‌లు పిలుపునిచ్చారు. విద్యార్థులు, నిరుద్యోగులు, యువత ఓటే రాష్ట్ర భవిష్యత్‌కు, చంద్రబాబు నాయుడు గెలుపునకు కారణం కావాలన్నారు. టీఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు గుమ్మడి గణేష్, గొర్రిపాటి రోహిణి కుమార్, భూమిరెడ్డి మోహన్‌రాజ్, అనకాపల్లి చెల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్చి 10లోగా లైసెన్స్‌లు చేయించుకోండి


పాడిరైతుకు బహుమతి అందిస్తున్న డీడీ రమణ

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 9: జిల్లాలో ఉన్న అన్ని ప్రైవేటు పాలకేంద్రాలు, బల్క్ మిల్క్ సెంటర్ల వారు మార్చి 10వ తేదీలోపు లైసెన్స్‌లు పొందాలని పశు సంవర్ధక శాఖ డీడీ వైవీ రమణ అన్నారు. శుక్రవారం సన్యాసయ్యపాలెం వద్ద మండల పశువైద్యాధికారిణి హేమ ఆధ్వర్యంలో నిర్వహించిన లేగదూడల ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. ఆరోగ్యకరమైన మేలు జాతి దూడలు ఉన్న వారికి బహుమతులు అందించి ప్రోత్సహించారు. మేలు జాతి లేగదూడలను ఎలా పొందాలో డీఎల్‌డీఏ జిల్లా వైద్యాధికారి ఎస్.దామోదర్ వివరించారు. డిప్యూటీ డైరెక్టర్ రమణ మాట్లాడుతూ పాడిరైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులు, గడ్డి పెంపకందారులు తమ పశువులకు వసతి కల్పించేందుకు కిసాన్ క్రెడిట్ పథకం ద్వారా పావలా వడ్డీకి రూ.1.60లక్షల రుణం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాలి సన్యాసయ్య, ఎంపీటీసీ మహాలక్ష్మి, ఏడీ చలపతిరావు, గోపాలమిత్రలు, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు


హెచ్చరిక బోర్డులు పెట్టిన దృశ్యం

జామి, ఫిబ్రవరి 9: ఎంతటి వారైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలకు వెనుకాడబోమని తహసీల్దార్ రాంబాయ్ హెచ్చరించారు. అట్టాడ గ్రామంలో భీమునిపట్నం సొసైటీ పేరుతో వేసిన లేఅవుట్‌లో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని సర్పంచ్ అమ్మన్నదొర కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదుపై స్పందించారు. వెంటనే సి బ్బందిని పంపించి అందులో ఉన్న ఎకరా 64 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ ద్వారా సేవలు

విజయనగరం రూరల్: బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ ద్వారా బ్రాహ్మణులకు విస్తృతంగా సేవలు అందాయని ఆ సొసైటీ మాజీ ప్రతినిధులు వాయునందన శర్మ, జంధ్యాల బుచ్చిబాబు, పేరి రామయ్య పంతులు శుక్రవారం తెలిపారు. స్థానిక బ్రాహ్మణ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఈ సొసైటీ ఏర్పాటైందన్నారు. చంద్రబాబుని గెలిపించేందుకు బ్రాహ్మణులంతా కదలాలన్నారు.

మెగా డీఎస్సీ పేరిట దగా


మాట్లాడుతున్న కొల్లి అప్పలనాయుడు

బాడంగి, ఫిబ్రవరి 9: అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ద్వారా వేలాది ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని హామీలు గుప్పించిన జగన్మోహన్ రెడ్డి కేవలం 6,100 పోస్టులను ప్రకటించడం దారుణమని విజయనగరం పార్లమెంట్ బీసీ సాధికార, కొప్పల వెలమ కన్వీ నర్ కొల్లి అప్పలనాయుడు అన్నారు. బాడంగిలో శుక్రవారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ ఇది మెగా డీఎస్సీ కాదు దగా డీఎస్సీ అని విమర్శించారు. రాష్ట్రంలో 26 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 6,100 పోస్టు లకు నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులుపు కోవడం దారుణమన్నారు. నిరుద్యో గుల పైన జగన్ సర్కారుకు నిజమైన ప్రేమ ఉంటే 26 వేల ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని, ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపడతామని చెప్పి నాలుగున్నరేళ్లు గడిచినా అతీగతీ లేదన్నారు. ఆయన వెంట టీడీపీ ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు ఉన్నారు.

రికవరీలపై దృష్టి


మాట్లాడుతున్న పీడీ కల్యాణ చక్రవర్తి

విజయనగరం (ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 9: జిల్లాలో కొనసాగుతున్న స్త్రీనిధి ఉన్నతి, సీఐఎఫ్ రికవరీలను మార్చి 31లోగా శతశాతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయ సమావేశ మందిరంలో 27 మండలాల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్నల్ ఆడిట్, స్త్రీనిధి, తదితర వాటికి సంబంధించి రికవరీని త్వరగా పూర్తి చేయాలన్నారు. మొబైల్ బుక్ బుకింగ్‌లో అన్ని మండలాలు ఏ గ్రేడ్‌లో ఉండాలని ఆదేశించారు. ఉద్యాన శాఖాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

సెంటర్ లైటింగ్‌కు మరమ్మతు పనులు


డివైడర్‌పై సెంటర్ లైట్లు వేస్తున్న దృశ్యం

రాజాం/రూరల్, ఫిబ్రవరి 9: పురపా లక సంఘం పరిధిలోని శ్రీకాకుళం రోడ్డు నుంచి బొబ్బిలి రోడ్డులోని ఆర్‌సీఎం చర్చి వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సమస్యపై కమిషనర్ ఎల్ రామప్పలనాయుడు స్పందించారు. ఈనెల 5న 'బిల్లులు రాక.. పనులు సాగక' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన నేప థ్యంలో డివైడర్‌పై ఉన్న మొక్కల కారణంగా సెంటర్ లైట్లు వెలగడం లేదని గుర్తించి మొక్కల కొమ్మలను తొల గించేలా శుక్రవారం చర్యలు తీసుకు న్నారు. సెంట్రల్ లైట్లు వెలగని ప్రాంతా ల్లో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. రానున్న వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఏఈలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఏఈ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 9: దేశంలో కార్మికులను, రైతులను పెట్టుబడిదారులకు బానిసలుగా చేస్తూ చట్టాల్లో మోదీ మార్పులు చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 16న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. శుక్రవారం అమర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ చట్టాల్లో మార్పులు చేస్తుంటే.. జగన్మోహన్‌రెడ్డి సీబీఐ కేసులకు భయపడి ఆ నల్ల చట్టాలను ఏపీలో అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ప్రతినిధులు బీవీ కొండలరావు, బుగత అశోక్, రంగరాజు, అప్పలరాజు, అప్పారావు, కామేష్, దుర్గారావు, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

తాటిపాడులో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

రేగిడి, ఫిబ్రవరి 9: తాటిపాడు గ్రామంలో రాజాం ఎన్ఎస్ఎస్ యునిట్ ఆధ్వర్యంలో శుక్రవారం వారం రోజుల ప్రత్యేక సేవా శిబిరం ప్రారంభించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ ప్రతినిధి పీఏఎస్ బాబూరావు ప్రారంభించారు. శనివారం జీఎంఆర్‌కేర్, జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా.కేవీఎస్ ప్రసాద్ తెలిపారు. ఉపసర్పంచ్ గోవిందరావు, సొసైటీ డైరెక్టర్ పి.రామినాయుడు, పంచాయితీ కార్యదర్శి చిన్నారావు, జెమ్స్ ఆసుపత్రి ప్రతినిధి శంకర్, ఉపాధ్యాయులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పార్కులో రోడ్డు నిర్మాణానికి బ్రేక్

- యథాస్థితిని కొనసాగించాలని హైకోర్టు ఉత్తర్వులు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 9: నగరంలోని దాసన్నపేట రామకృష్ణ నగర్‌లో ఉన్న పార్కు ప్రహరీ కూల్చి... రోడ్డు వేయాలన్న నిర్ణయానికి హైకోర్టు బ్రేక్ వేసింది.. 'పార్కుపై వైసీపీ నేతల కన్ను' పేరిట 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం కథనం వెలువడింది. దీనికి స్పందించిన స్థానికులు హుటాహుటిన హైకోర్టును ఆశ్రయించారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకూ పార్కుని యథాస్థితిలో ఉంచాలని కోర్టు ఉత్తర్వులలో పేర్కొంది. రామకృష్ణ నగర్ కాలనీ వాసులు, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో పార్కు ఎదుట నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, కాలనీ వాసులు రజని, సబ్బి నాగమణిలు మాట్లాడుతూ పార్కును పరిరక్షించుకునేందుకు హైకోర్టును ఆశ్రయించామన్నారు. పార్కు ప్రహరీ తీసేస్తే, దొంగతనాలు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐదో డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నాగరాజు, దువ్వ రాము, పూసర్ల లక్ష్మి, సబ్బి సత్యవతి, సాయిరాజు, వంగరాపు శ్రీను, చిన్ని సురేష్, దువ్వ చిన్న తదితరులు పాల్గొన్నారు.


పార్కు ఎదుట రామకృష్ణనగర్ కాలనీ వాసుల నిరసన

ఎన్నికల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలి



రావుపల్లిలో పోలింగ్ కేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ జయ

గరుగుబిల్లి: సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కె.జయ సూచించారు. మండలంలోని చినగుడబ, పెదగుడబ, వల్లరిగుడబ, కొత్తపల్లి, రావుపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల ప్రాంతాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల పరిధిలో సమస్యలు ఉన్నట్లయితే సమాచారం అందించాలన్నారు. బీఎల్వోలు, వీఆర్వోలు అందుబాటులో ఉండాలన్నారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పరిశీలనలో ఆర్ఐ మండంగి కృష్ణ, వీఆర్వో టి.శ్రీనివాసరావు, కార్యదర్శి సాయికుమార్, హెచ్ఎం జె.తిరుపతిరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

భామిని: మండలంలోని ఘనసర, లివిరి, దిమ్మిడిజోల పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు ఉంటే తెలియజేయాలని బీఎల్వోలకు సూచించారు. మౌలిక సదుపాయాలు పక్కాగా ఉండాలన్నారు. ఓటరు జాబితా సవరణ చేయాలన్నారు. ఆయనతో పాటు రాంబాబు, భారతి, శంకరరావు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించండి

● ఎంపీడీవోకు జడ్పీ సీఈవో రాజ్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో రాజ్‌కుమార్

జియ్యమ్మవలస: మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి రికార్డును పూర్తిస్థాయిలో నిర్వహించాలని జడ్పీ ముఖ్య కార్య నిర్వాహణాధికారి కె.రాజ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన వార్షిక తనిఖీ నిమిత్తం ఎంపీడీవో కార్యాలయానికి వచ్చారు. అయితే ఎంపీడీవో కార్యాలయంలో 2023-24 సంవత్సరానికి సంబంధించి రికార్డులను పరిశీలించారు. అయితే కొన్ని రికార్డులు లేనందున ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులు నిర్వహణ విషయంలో అలసత్వం ఉండకూడదని ఎంపీడీవో శ్రీనివాసరావును సూచించారు. లేదంటే కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో బీజేపీ 'పల్లెకు పోదాం'



పల్లెకు పోదాం కార్యక్రమంలో బీజేపీ నాయకులు

పాలకొండ: బీజేపీ పల్లెకు పోదాం కార్యక్రమాన్ని మండలంలోని కొండాపురం, పరశరాంపురం గ్రామల్లో శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు టంకాల దుర్గారావు, సుక్క మహాలక్ష్మి, కారెపు చిట్టిబాబు, మృత్యుంజయరావు, ఉదయాన అప్పలనాయుడు, బొత్స సంగంనాయుడు పాల్గొన్నారు.

ఇదేమి రైతు ప్రభుత్వం?



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సాలూరు రూరల్: వైసీపీ ప్రభుత్వం రైతులకు విద్యుత్ సరఫరాను తగ్గించడంపై టీడీపీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేశు మండిపడ్డారు. టీడీపీ నేతలు కరిబుగత భాస్కరరావు, వెంకటరావుతో కలసి ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. రైతులకు దగా చేస్తున్న రైతు ప్రభుత్వంగా వైసీపీ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. రైతులకు ఇప్పటి వరకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా జరిగేదన్నారు. కొద్దిరోజులుగా ఈ వేళలను కుదించారన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు కుదించారన్నారు. అలాగే ఉదయం గంట, సాయంత్రం గంట పాటు విద్యుత్ సరఫరాలో కోత విధించారన్నారు. ఎండలు మండిపోతున్న తరుణంలో రైతులకు సరఫరా చేసే విద్యుత్‌లో కోత విధించడం దారుణమన్నారు. రైతులకు పాత విధానంలోనే విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

ఒడిశా

రాయగడ: టికిరి రైల్వేస్టేషన్ సమీపంలో ఓ పాడుబడిన భవనంపై టికిరి పోలీసులు దాడిచేసి ఇద్దరు గంజాయి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు పాలిథిన్ సంచుల్లో రవాణాకు సిద్ధంగా ఉంచిన 102.2 కిలోల గంజాయిని, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. పట్టుబడిన నిందితుల్లో ఒకరు టికిరికి చెందిన రహీంకుమార్ బెనియా(27), తలకొండిగా గ్రామానికి చెందిన లింకన్ తురుక్(25)గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

గిరిజన సంస్కృతులు చాలా గొప్పవి



సన్మానం పొందిన గిరిజనులు

రాయగడ: గిరిజన సంస్కృతులు చాల గొప్పవని ట్రైబల్ కల్చర్ అభివృద్ధి మండలి ఉపాధ్యక్షుడు బనమాలి కద్రక అన్నారు. కళ్యాణ సింగుపూర్ సమితిలో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కులాల అభివృద్ధి, మైనారటీ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ట్రైబ్ కల్చర్ ప్రోగ్రెస్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ట్రైబ్ సంస్కృతి, పరిరక్షణ అందరి ఆశయం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజీవ్ దాస్, సమితి ఉపాధ్యక్షుడు దుంబ్రు కాంజ్కా, జిల్లా ఆర్ట్ కల్చర్ సంఘం ఉపాధ్యక్షుడు ప్రశతికుమార్ ప్రసన్న తదితరులు హాజరయ్యారు. ఈ వేదికపై 25 మంది గిరిజనులకు అతిథులను సన్మానించారు. బ్లాక్ మార్స్ అధికారి చందనబంగారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అగ్నిమాపక సిబ్బంది, శిశు అభివృద్ధి శాఖాధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన గిరిజన నృత్యాలు అలరించాయి.

సమాచార హక్కు చట్టంపై వర్క్‌షాపు



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ సంఘమిత్ర

రాయగడ: జిల్లా యంత్రాంగం శుక్రవారం సమాచార హక్కు చట్టంపై (ఆర్టీఐ) అవగాహన కార్యక్రమం నిర్వహించింది. సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్ర దేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖకు చెందిన ఆర్టీఐ చట్టం నిపుణుడు హర్షా పరిచా చట్టం విధి విధానాల ఉపయోగాలపై సమగ్ర వివరణ ఇచ్చారు. ఆర్టికల్ 4-1(బి), అన్ని రకాల మాన్యువల్ కింద సమాచారం నవీకరించడం వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి, ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. అదనపు ముఖ్య అభివృద్ధి అధికారి నరేంద్రనాయక్, డీఐ పీఆర్వో బసంతకుమార్ ప్రధాన్, జిల్లాలోని అన్ని సమితుల అధికారులు పాల్గొన్నారు.

లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలి



పార్వతీపురం: మాట్లాడుతున్న విజయచంద్ర,



జియ్యమ్మవలస: మాట్లాడుతున్న జగదీశ్వరి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈ నెల 13న రాత్రికి పార్వతీపురం చేరుకుంటారని, 14న బహిరంగ సభ ఉంటుందని నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర తెలిపారు. ఈ సభను టీడీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. యువగళం పాదయాత్ర జరగని నియోజకవర్గాల్లో లోకేష్ పర్యటిస్తారన్నారు. సంక్షేమ పథకాలతో పాటు వైసీపీ ప్రభుత్వ కాలంలో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలకు వివరిస్తారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బోను దేవిచంద్రమౌళి, జి.వెంకటనాయుడు, బార్నాల సీతారాం, బడే గౌరునాయుడు, కోలా మధుసూదనరావు, మజ్జి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. **జియ్యమ్మవలస:** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటనలో భాగంగా ఈనెల 13న సాయంత్రం 4 గంటలకు గరుగుబిల్లి మండలం ఎర్రన్నగుడి సమీపంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, టీడీపీ కురుపాం నియోజకవర్గం ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి పిలుపునిచ్చారు. శుక్రవారం చినమేరంగి గ్రామంలో శత్రుచర్ల కోటలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లోకేష్ బహిరంగ సభకు నియోజకవర్గం పరిధిలోని తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెప్పడానికి తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు సిద్ధం కావాలని కోరారు. చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గరుగుబిల్లి, కొమరాడ, జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **గుమ్మలక్ష్మీపురం:** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ శంఖారావం సభ ఈనెల 13న సాయంత్రం 4 గంటలకు గురుగుబిల్లి మండలం ఎర్రన్నగుడి సమీపంలో జరుగుతుందని, దీన్ని విజయవంతం చేయాలని నియోజవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి కోరారు. శుక్రవారం బహిరంగ సభ ప్రాంతాన్ని టీడీపీ శ్రేణులతో కలసి ఆమె పరిశీలించారు.

నేడు టీడీపీ కార్యకర్తల సమావేశం

గరుగుబిల్లి: తెలుగుదేశం పార్టీ మండల కార్యకర్తల సమావేశాన్ని శనివారం ఉల్లిభద్ర సమీపంలోని ఎర్రన్నగుడి ఆవరణలో నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 13న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటించనున్నారని చెప్పారు. ఈ పర్యటన దృష్ట్యా సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

నులిపురుగుల నిర్మూలనతో ఆరోగ్యం: డీఎంహెచ్‌వో



విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌వో

బెలగాం: పిల్లల్లో అనేక అనారోగ్య సమస్యలకు, రక్త హీనతకు కారణమైన నులి పురుగులను నిర్మూలిస్తే వారు ఆరోగ్యంగా ఉంటారని డీఎంహెచ్‌వో బి.జగన్నాథం అన్నారు. పార్వతీపురంలోని డీవీఎం మున్సిపల్ పాఠశాలలో శుక్రవారం జాతీయ నులి పురుగుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో డీఈవో జి.పగడాలమ్మ, మున్సిపల్ కమిషనర్ పి.సింహాచలం, డీఈపీఆర్వో ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు. **సాలూరు రూరల్:** సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వైద్యసిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పాచిపెంట మండలం గురువునాయుడుపేటలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డి.శివకుమార్ ప్రారంభించారు. **కురుపాం రూరల్:** గుజ్జువాయి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ పిల్లలకు మొండెంఖల్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.ప్రజ్ఞ శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. సర్పంచ్ నాగేశ్వరరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. **పాలకొండ:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో ఆల్బెండాజోల్ మాత్రలు శుక్రవారం పంపిణీ చేశారు. **గరుగుబిల్లి:** విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో పైల సూర్యనారాయణ సూచించారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో ఆయనతో పాటు ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు, వైద్యులు పాల్గొన్నారు. **కురుపాం:** కురుపాంలో రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ శంకరరావు ఆధ్వర్యంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, సర్పంచ్ గార్ల సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్.. విద్యార్థులకు మాత్రలు మింగించారు. **సీతానగరం:** అజ్జాడ గ్రామంలో నిర్వహించిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా మలేరియాధికారి టి.జగన్‌మోహనరావు శుక్రవారం తనిఖీచేశారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడాన్ని ఆయన పరిశీలించారు. **భామిని:** చిన్నారులు నులిపురుగుల బారిన పడకుండా చూడాలని భామిని పీహెచ్‌సీ వైద్యాధికారి సోలో తెలిపారు. శుక్రవారం భామినిలో అంగన్వాడీ, కస్తూరిబా ఆశ్రమ పాఠశాల, సాంఘిక పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో మాత్రలను వేశారు. వైద్యాధికారిణి దీపిక పాల్గొన్నారు. **వీరఘట్టం:** సంతనర్సిపురం పాఠశాలలో వైద్యాధికారి పాలవలస ఉమామహేశ్వరి విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

నాలుగోసారి వాయిదా



పాటదారుల కోసం ఎదురుచూస్తున్న మున్సిపల్, రెవెన్యూ అధికారులు

పార్వతీపురంటౌన్: మున్సిపల్ మార్కెట్ ఆశీలు వసూలుకు సంబంధించిన బహిరంగ వేలం నాలుగోసారి వాయిదా పడింది. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్కెట్ ఆశీలు వేలంలో పాటదారులు ఎవరూ పాల్గొనకపోవడంతో వాయిదా పడింది. ఇప్పటికీ నాలుగుసార్లు మార్కెట్ ఆశీలు వసూళ్ల బహిరంగ వేలం వాయిదా పడడంతో పలు అనుమానాలకు తావిస్తుంది. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు మున్సిపల్‌మార్కెట్ పరిధిలో ఆశాలు వసూలు చేసుకునేందుకు గత నెల 12వ, 19వ, 24వ తేదీల్లో బహిరంగ వేలం ప్రకటనలు చేయగా పాటదారులు ఎవ్వరూ పాల్గొనలేదు. నాలుగోసారి కూడా పాటదారులు పాల్గొనకపోవడంపై మున్సిపల్ కమిషనర్ సింహాచలంతో పాటు రెవెన్యూ అధికారులు కారణాలు వెదుకుతున్నారు.

పాటదారులు ఏమంటున్నారంటే...

ఇప్పటికే ఆశీలు వసూలులో తాము ఇబ్బందులు పడుతున్నామని, మున్సిపల్ కమిషనర్‌తో పాటు రెవెన్యూ అధికారుల సహకారం లేదంటున్నారు. ఆశీలు వసూలుకు సంబంధించి గెజిట్ ప్రకారం కాకుండా కమిషనర్, రెవెన్యూ అధికారులు చెప్పిన నిబంధనలు పాటించాలంటే కుదరదంటున్నారు. 2023-24లో రూ.23.74 లక్షలకు ఆశీలు పాట ముగిస్తే 2024-25కుగాను రూ.26.24 లక్షలు ఆశీలు పాట ప్రారంభం అవ్వడం నష్టాల్లో కూరుకుపోయేలా చేస్తుందని, పాటదారుల్లో ఒకరూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల వ్యవహారిక తీరు వల్ల ఆశీలు పాటలో పాల్గొనలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ ఆశీలుతో పాటు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపుల వేలం కూడా వాయిదా పడినట్లు అధికారులు ప్రకటించారు.

రహదారి నిబంధనలు పాటించాలి



పార్వతీపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పార్వతీపురంటౌన్: ప్రతిఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని పార్వతీపురం మన్యం జిల్లా ప్రజా రవాణా అధికారి పి.సుధాకర్ కోరారు. రహదారి మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు ఉద్యోగులు, కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు ప్రయాణికులను తమ గమ్యస్థానాలను చేర్చడంలో రహదారి భద్రత నిబంధనలు పాటించాలన్నారు. మద్యం తాగడంతో పాటు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. ముఖ్యంగా అతివేగం వాహనచోదకులకే కాకుండా వారి కుటుంబాలను అనాథలను చేస్తుందన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ దుర్గా, తదితరులు పాల్గొన్నారు. **పాలకొండ:** ప్రతిఒక్కరూ రోడ్డుభద్రత పాటించాలని ఆర్టీసీ డ్రైవర్లు జాగ్రత్తగా బస్సులు నడపాలని పాలకొండ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రహదారి భద్రతా వారోత్సవాలు సందర్భంగా శుక్రవారం ఆర్టీసీ బస్సు డిపో నుంచి పాలకొండ బస్సు కాంప్లెక్స్ వరకు ఆర్టీసీ ఉద్యోగులతో ప్లకార్డులు, బ్యానర్లతో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎస్.లక్ష్మణరావు, రాజు, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ రాజు, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ బి.రాంబాబు, ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ సెక్రటరీ భాసూరు కృష్ణమూర్తి, డిపో నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ

కురుపాం: కురుపాం ఎంపీడీవో కార్యాలయాన్ని విజయనగరం జడ్పీ సీఈవో రాజ్‌కుమార్ తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆఫీసులో రికార్డులు పరిశీలించారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను ఎంపీడీవో అప్పారావును అడిగి తెలుసుకున్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం



మనుమకొండలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భామిని: అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కొత్తూరు బీట్ ఆఫీసర్ లక్ష్మణరావు కోరారు. శుక్రవారం ఆదివాసీ గిరిజన గ్రామాలైన మనుమకొండ, పాలవలస తదితర గ్రామాల్లో అవగాహన కల్పించారు. కొండపోడు కోసం నిప్పు పెట్టినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వన్య ప్రాణులకు ప్రమాదం సంభవించకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన రైతులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన అవసరం



ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ వైద్యసిబ్బంది

సాలూరు రూరల్: కుష్ఠు వ్యాధిపై అవగాహన అవసరమని మామిడిపల్లి సర్పంచ్ సువ్వాడ శశికళ పిలుపునిచ్చారు. గ్రామంలో శుక్రవారం కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధిని దాచుకోవద్దన్నారు. శరీరంపై మచ్చలుంటే వైద్య సిబ్బందికి చూపించాలన్నారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆశీలు వేలం ఖరారు

పాలకొండ: నగర పంచాయతీకి చెందిన రోజువారీ మార్కెట్ ఆశీలు, రోడ్డు మార్జిన్, వారపు సంతలు, చెట్ల ఫలసాయం, కబేళా, వ్యాపారుల రోజువారీ కలెక్షన్‌కు సంబంధించిన ఆశీలు వేలం పాట శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ముగ్గురు పాటలో పాల్గొన్నారు. ఇద్దుబోయిన మహేష్ రూ.9,71,000కు పాటను దక్కించుకున్నారు. కౌన్సిల్ ఆమోదం పొందిన తర్వాత ఆశీలు వసూలు చేసుకోవచ్చునని కమిషనర్ తెలిపారు.

విద్యార్థులు లక్ష్యాన్ని సాధించాలి

భామిని: విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేయాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎర్రంనాయుడు సూచించారు. శుక్రవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ఫేర్‌వెల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

ఉపాధి ఇన్‌చార్జి ఇంజినీరుగా శ్రీనివాసరావు

గరుగుబిల్లి: మండల ఉపాధి హామీ ఇన్‌చార్జి ఇంజినీరుగా డి.శ్రీనివాసరావును జిల్లా డ్వామా పీడీ కె.రామచంద్రరావు నియమించారు. గతంలో మండల ఇంజినీరుగా వ్యవహరించిన ఎ.గోపాలకృష్ణ పట్నాయక్‌కు పాచిపెంట మండలం బదిలీ చేశారు. ఈయన స్థానంలో సీతానగరం మండలంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఏపీవో మండల గౌరీనాథ్ మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు విధుల్లో చేర్చుకున్నట్లు ఆయన తెలిపారు.

36 మందికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి

సీతంపేట: ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 36 మంది ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించినట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు అన్నదొర శుక్రవారం తెలిపారు. వీటిలో తెలుగు 16, హిందీ 14, ఫిజికల్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్లు ఆరుగురు ఉన్నారని తెలిపారు. వీరందరికీ పదోన్నతి పత్రాలను అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి లిల్లీ రాణి, కార్యాలయ పర్యవేక్షకులు దేశ్, హరిగోపాల్, కోటిబాబు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్య సాధనే లక్ష్యం



గుణాత్మక విద్యను పరిశీలిస్తున్న బృంద సభ్యులు

పాలకొండ: పాఠశాల సర్వతోము ఖాభివృద్ధికి, విద్యార్థుల గుణాత్మక విద్య సాధనకు శ్రమించి సత్ఫలితాల దిశగా కృషి చేయాలని మండల లిప్ టీమ్ సభ్యులు అన్నారు. ఉపవిద్యాశాఖాధికారి పర్రి కృష్ణమూర్తి నేతృత్వంలో మండల లిప్ మానిటరింగ్‌లో భాగంగా ఓని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. బృంద సభ్యులైన బౌరోతు మల్లేశ్వరరావు, అప్పికొండ రాంబాబు, తండాడి అనిల్‌కుమార్, తామాడ సూర్యనారాయణలు, అభ్యసనాభివృద్ధి కార్య క్రమం ఎరిశీలించారు. హెచ్ఎం బలగ నాగమణి, ఉపాధ్యాయులు పాలవలస శారదాకుమారి, గోగుల సూర్యనారాయణ, దానేటి పుష్పలత, సిద్దాబత్తుల వెంకటరమణ, కుదమ తిరుమలరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఎన్టీఆర్ జీవిత చరిత్రపై పుస్తకం

పాలకొండ: స్వర్గీయ ఎన్టీ రామారావు నట, రాజకీయ ప్రస్థానంపై విశ్వతేజ అనే పుస్తకాన్ని పాలకొండకు చెందిన విశ్రాంత గ్రంథాలయాధికారి కనపాక చౌదరినాయుడు రచించారు. ఎన్టీఆర్‌కు చెందిన జీవిత చరిత్ర అంశాలు, నట జీవితం, రాజకీయ ప్రస్థానం తదితర అంశాలను పుస్తక రూపంలో నిక్షిప్తం చేశారు. తనమిత్రుడు, మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావుతో కలిసి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఆవిష్కరించనున్నట్లు చౌదరినాయుడు తెలిపారు. 225కు పైగా పేజీలతో ఈ పుస్తకాన్ని ఎంతో ఆకర్షణీయంగా తయారు చేయించారు.

భారత్ బంద్‌ను జయప్రదం చేయండి

సాలూరు: దేశ వ్యాప్తంగా ఈనెల 16 నుంచి చేపట్టనున్న గ్రామీణ భారత్ బంద్‌లో కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాలు, జేఏసీ ఉమ్మడిగా పిలుపునిచ్చాయి. శుక్రవారం సాలూరులోని సీఐటీయూ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు రామచంద్రరావు, ఎన్‌వై నాయుడు మాట్లాడారు. మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నా మని చెప్పారు. 125 ప్రపంచ దేశాల్లో ఆకలి బాధల్లో భారత్ 11వ స్థానంలో ఉందని విమర్శించారు.

గిరిజన మహిళలకు శిక్షణ ప్రారంభం

కురుపాం రూరల్: చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు, మహిళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 30 మంది గిరిజన మహిళలకు 45 రోజులు ఇచ్చే కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని గొటివాడ గ్రామంలో కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి శుక్రవారం ప్రారంభించారు. గిరిజన మహిళలు కుట్టు శిక్షణ పొంది స్వయం ఉపాధి పొందాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.సొసైటీ డైరక్టర్ షేక్ గౌష్, మహిళా వెల్ఫేర్ సంస్థ డైరక్టర్ పద్మ పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

సీతానగరం: ఎన్నికల విధి నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ జనార్థనరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ చిట్టెమ్మ, వివిధ గ్రామాల బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల పనుల పరిశీలన

మక్కువ: అనసభద్ర గ్రామ సమీపంలో చేపడుతున్న ఏకలవ్య పాఠశాల నిర్మాణ పనులను ఇంజినీరింగ్ చీఫ్ ఎస్.శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. ఈనెల 14న పాఠశాల ప్రారంభోత్సవం సందర్భంగా పనులను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ శాంతేశ్వర్రావు, డీఈ మనోజ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు ప్రకృతి వ్యవసాయంపై సదస్సు

గరుగుబిల్లి: తోటపల్లి జట్టు ప్రాంగణంలో శనివారం ప్రకృతి వ్యవసాయ విధానంలో జీడి తోటల పెంపకంపై సదస్సు నిర్వహించనున్నట్లు జట్టు ట్రస్టు వ్యవస్థాపకుడు డా.డి.పారినాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి డైరెక్టర్ జనరల్ ఆర్పీ సిసోడియా హాజరవుతున్నారన్నారు. జీడి తోటల నిర్వహణపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఉత్తమ జీడి రైతులకు జీడి రత్న పేరుతో అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.